క్లుప్తంగా

బాధిత కుటుంబానికి రూ.2 లక్షల సాయం


బాధిత కుటుంబానికి చెక్‌ను అందజేస్తున్న చైర్మన్ తాతాజీ

కరప: మండలం వేములవాడ పీఏసీఎస్‌లో బుధవారం బాధిత కుటుంబానికి రూ 2 లక్షల ఆర్థిక సాయాన్ని ఆ సొసైటీ చైర్మన్ బండే తాతాజీ అందజేశారు. పీఏసీఎస్ పరిధిలోని రైతు వి.సూరిబాబు ఇటీవల పాముకాటుకు గురై మరణించగా, అతని భార్య కృష్ణవేణికి సొసైటీ ద్వారా ఆర్థిక సాయం అందించినట్టు తాతాజీ తెలిపారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఉద్దండ సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు కమిడి శంకర్, సీఈఓ నల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ స్వరూపమే సింహాద్రి అప్పన్న

బోట్‌క్లబ్: అంతర్గతంగా వున్న ఆత్మ రూపాన్ని దర్శించడమే సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనమని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. స్థానిక సూర్యరావుపేటలోని భోగిగణ పతిపీఠంలో బుధవారం చందనంతో చిత్రించిన సింహాద్రి అప్పన్నకు శ్రీవారి సేవా సమితి సభ్యులు విష్ణు సహస్రనామ పారాయణతో ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. సింహాచల క్షేత్రంలో వరాహ లక్ష్మీ నరసింహస్వామి నిజరూప దర్శనం వైశాఖ శుద్ధ తదియ రోజున ఏడాదిలో 12గంటలు మాత్రమే లభిస్తుందన్నారు. 1908లో ప్రహ్లాదుడు కోరికపై సింహగిరి పర్వతంపై కొలువైన సింహాద్రి అప్పన్నను దర్శించడం బాహ్య రూపంలో వున్న మానవుడు తన ఆత్మ స్వరూపాన్ని తెలుసుకునే తత్వమన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత


కరప: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆ శాఖ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. కరపలో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. స్థానిక విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, 33 కేవీ లైన్‌లో మరమ్మతులు చేస్తున్నందు వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ తెలిపారు. కరప సబ్‌స్టేషన్ పరిధిలో కరప, పేపకాయలపాలెం, వలసపాకల, వేములవాడ, వాకాడ, పెదకొత్తూరు, కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, పెనుగుదురు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

18 నుంచి మాండవ్య నారాయణుని కల్యాణోత్సవాలు


మాండవ్య నారాయణస్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక భీమవరం తుల్యభాగ నదీ తీరాన కొలువైన శ్రీ, భూ సమేత మాండవ్య నారాయణుని కల్యాణోత్సవాలు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఏటా ఉగాది తరువాత వచ్చే ఏకాదశి రోజున స్వామి వారి కల్యాణం జరుగుతుందని చెప్పారు. 18న గరుడ వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం, 19న మంగళస్నానాలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం రాత్రి స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. 23న ధ్వజావరోహణ, పూర్ణాహుతి, 24వ తేదీ రాత్రి శ్రీపుష్పయోగోత్సవంతో కల్యాణ ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

ఘనంగా బద్దిగడుగు ఉత్సవం


నూకాలమ్మ ఆలయం వద్ద బద్దిని తీసుకువస్తున్న ఆసాదులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ తల్లి బద్దిగడుగు ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ, చైర్మన్ గవరసాని వీరాస్వామిల ఆధ్వర్యంలో ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఏటా ఉగాది రోజున అమ్మవారి ఆలయ తలుపులు మూసివేసి మరుసటి రోజున ఆలయ తలుపులు తెరచి బద్ది ఉత్సవాన్ని నిర్వహిస్తారు. బాజాభజంత్రీలతో ఏలేరు నదికి వెళ్లి బద్దిని కడిగి తీసుకువచ్చి అమ్మవారి ఆలయంలో ఉంచుతారు. గరగను పూజించి అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆలయ ఆసాదులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా రబీ

- ప్రారంభమైన వరి కోతలు
- నియోజకవర్గంలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు


పాలు పోసుకునే దశలో ఉన్న చేలు


పక్వదశలో ఉన్న రబీ పంట


ఏవీ రాజేష్, ఎంఏఓ, కరప

కరప: మండలంలో రబీపంట ఆశాజనకంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట పక్వదశకు చేరడం రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. వాతావరం అనుకూలించి పంట బాగుందని, మరో రెండు, మూడు వారాలు భగవంతుడు కరుణిస్తే పంట చేతికి అందుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. తొలకరిలో ఎదురైన నీటి ఎద్దటితో దాళ్వా ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందినప్పటికీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చొరవతో మండలంలోని సంపరబోది, గరువు కాలువ, యండమూరు చానల్‌ను ముందుగానే యుద్ధ ప్రాతిపదికన తవ్వించి మార్గం సుగమం చేయించారు. మండలంలో సుమారు 14,443 ఎకరాల్లో వరి సాగు చేశారు. రైతులు ఎంటీయు-3626 (బొండాలు) ఎక్కువగా సాగుచేశారు. ఎకరానికి ఇంతవరకు రూ.30 వేల వరకు పెట్టుబడులు అయినట్టు వారు పేర్కొన్నారు. కూలీరేట్ల నుంచి ఎరువులు, పురుగు మందుల వరకు ధరలు పెరిగిపోయాయి. ముందుగా ఊడ్చిన వరిచేలు పక్వదశలోను, లేతచేలు పాలుపోసుకుని, గింజగట్టిపడే దశలోను ఉన్నాయి. వాతావరణం మరో రెండు వారాలు అనుకూలించి దోమపోటు వంటి పంట తెగుళ్లు ఆశించకపోతే ఎకరానికి 40 నుంచి 50 బస్తాలు దిగుబడి రావచ్చని రైతులు అంచనా వేస్తున్నారు.

వరి కోతలు ప్రారంభం

మండల పరిధిలో ముందుగా ఊడ్చిన పొలాల్లో వరిచేలు పక్వదశకు చేరుకోగా రైతులు కోతలకు సిద్ధమవుతున్నారు. కొత్త అమావాస్య వెళ్లడంతో కోతల ప్రారంభమయ్యాయి. మిషన్‌తో కోయించడానికి ఎకరాకు రూ 3 వేలు నుంచి రూ. 3,500 తీసుకుంటున్నారు. మనుషులతో కోయించడానికి మగవారికి రూ.900, మహిళలకైతే రూ.500 తీసుకుంటున్నట్టు రైతులు తెలిపారు.

16 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

రైతు పండించిన పంటకు మద్దతు ధర అందించేందుకు నియోజకవర్గ పరిధిలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, కరప మండలంలో 16 ఏర్పాటు చేశాం. ఎన్నికలకోడ్ అమలులో ఉండటంతో ఈఏడాది రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించాం. సాధారణ రకమైతే 75 కిలోల బస్తాకు రూ.1,637, గ్రేడ్-ఎ రకమైతే రూ.1,652 మద్దతు ధర అందిస్తారు. ఈ ఏడాది క్వింటాకు రూ.143 అదనంగా ఇస్తున్నారు. రబీకోతలకు నాలుగైదు రోజులు ముందు అపరాల విత్తనాలు చల్లుకోవాలి. పండితే అదనపు ఆదాయం వస్తుందని, వాతావరణం అనుకూలించకపోతే అపరాల మొక్కలతో భూమి సారవంతమవుతుంది.

రామలింగేశ్వర స్వామికి వైభవంగా అభిషేకాలు


రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: వసంత నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి నవావరణార్చన వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.

పండగ పూటా చంద్రబాబు అబద్ధాలు


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి


భర్తకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ద్వారంపూడి మహాలక్ష్మి

- వలంటీర్లను మభ్యపెట్టే మరో యత్నం
- ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి

కాకినాడ: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పండగపూట మరోసారి అబద్ధాలకు తెరలేపారని వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. నిన్నమొన్నటి వరకు వలంటీర్ వ్యవస్థను తూలనాడిన చంద్రబాబు ఇప్పుడు రూ.10 వేలు వేతనం ఇస్తానంటూ చేసిన వ్యాఖ్యను పరిశీలిస్తే అతని నైజం అర్థమవుతోందన్నారు. స్థానిక 12వ డివిజన్ సంజయ్‌నగర్ ప్రాంతంలో ఎమ్మెల్యే ద్వారంపూడి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ 2014లో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంలో తొలిసంతకాలు చేసిన చేనేత, రైతు, మహిళా రుణాల మాఫీలను సైతం గాలికొదిలేసిన చంద్రబాబు ఇప్పుడు మరో అబద్ధపు హామీ ఇస్తే నమ్మేందుకు ప్రజలెవ్వరూ సిద్ధంగా లేరన్నారు. పవిత్రమైన ఉగాది పండుగరోజు వలంటీర్లపై ప్రేమ ఒలకబోస్తున్నారని, వాస్తవానికి ఆయన జన్మభూమి కమిటీలను మాత్రమే ప్రోత్సహిస్తారని పేర్కొన్నారు. అవినీతి రహిత పాలన అందించే దిశగా వలంటీర్లు ఎంతో సమర్థవంతంగా పనిచేస్తుంటే వారిని గోనె సంచులు మోసే వ్యక్తులుగాను, మహిళల అక్రమ రవాణా చేసే అసాంఘిక శక్తులుగాను పోల్చిన ఘన చరిత్ర చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లదేనన్నారు. వేషాలు మార్చినంత తేలికగా అబద్ధాలు చెబితే నమ్మి మోసపోవడానికి వలంటీర్లుగానీ, ప్రజలుగానీ సిద్ధంగాలేరన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, స్థానిక నాయకులు బొదిరెడ్ల పుష్ప పరశురామ్, మట్టపర్తి రఘురామ్, జితేంద్రసింగ్, కోనాడ దుర్గాప్రసాద్, మాకిరెడ్డి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ద్వారంపూడి సతీమణి ప్రచారం

ఎమ్మెల్యే సతీమణి ద్వారంపూడి మహాలక్ష్మి బుధవారం 41వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒంటిమామిడి జంక్షన్, పూళ్లవారి వీధి ప్రాంతాల్లో ఆమె పలువురు మహిళా నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తన భర్త చంద్రశేఖరరెడ్డి చేసిన అభివృద్ధిని చూసి మరోసారి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారానికి వెళ్లిన ఆమెకు స్థానిక మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట కొండా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటు వేయండి


జెడ్.భావారంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- మండలంలో విస్తృత ప్రచారం

కరప: రాష్ట్ర చరిత్రలో పాలనలో సంస్కరణలు తీసుకు వచ్చి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేసి, జగన్‌ను మళ్లీ సీఎం చేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. మండలంలోని కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట గ్రామాల్లో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి జరిగిందంటే ఓటు వేయండి అని అడిగే దమ్మున్న నాయకుడిగా దేశ చరిత్రలోనే సీఎం జగన్ నిలుస్తారన్నారు. ఇచ్చిన హామీలు 99 శాతం ఆయన నెరవేర్చారన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలకు అతీగతీ లేకుండా చేశారన్నారు. ఇద్దరి పాలన బేరీజు వేసుకోవాలన్నారు. టీడీపీ, జేఎస్‌పీ, బీజేపీ దొంగల ముఠాగా జతకట్టి ఎన్నికల వేళ మాయ మాటలు చెప్పేందుకు వస్తున్నారని ప్రజలే వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఐదేళ్ల పాలనలో రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులు గడప దాటక్కర్లేకుండా సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, నాడు-నేడు ద్వారా పాఠశాలల ఆధునీకరణ, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు, అరట్లకట్ట వంతెన, ఆలయాల నిర్మాణం, సచివాలయ, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాల నిర్మాణం, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రూపేణా కొరిపల్లిలో రూ 15.98 కోట్లు, జెడ్.భావారంలో రూ.6.04 కోట్లు, గొడ్డటిపాలెంలో రూ.18.15 కోట్లు, అరట్లకట్టలో రూ.44 కోట్లు ప్రయోజనం చేకూర్చినట్టు తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, గ్రామాల్లో మరింతగా అభివృద్ధి జరగాలన్నా ఎమ్మెల్యే తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించి తద్వారా జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని కన్నబాబు కోరారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పలివెల నాగేశ్వరరావు, కొత్త నాగలక్ష్మి, వాసంశెట్టి శ్రీనుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, అరట్లకట్ట గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, ఎంపీటీసీ దేవిశెట్టి సూర్యప్రకాష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే రాంబాబు, కోలా శ్రీనివాస్, తిబిరిశెట్టి గజేంద్రుడు, గెడ్డం కృష్ణ, పట్ల అబ్బు, నక్కా వీరభద్రరావు, సింగినేని చినబాబు, రాయుడు జనార్దన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమానికి అపూర్వ స్పందన


గొడ్డటిపాలెంలో పార్టీలో చేరిన వారికి వైఎస్సార్ సీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు


దుమ్ములపేటలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- గొడ్డటిపాలెంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక
- పార్టీకండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, విద్య, వైద్యానికి ఇస్తున్న ప్రాధాన్యం, చేసిన అభివృద్ధిని చూసి ప్రజల నుంచి అపూర్వ స్పందన కనిపిస్తోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా మహిళలు పెద్ద ఎత్తున ఎదురొచ్చి స్వాగతం పలుకడమే నిదర్శనమన్నారు. మరో పక్క ప్రతిపక్షపార్టీల అనైతిక పొత్తు, వాళ్ల పోకడలకు విసుగు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. గొడ్డటిపాలెంలో బుధవారం సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, మాజీ ఎంపీటీసీ రాయుడు జనార్దన్, పీఏసీఎస్ చైర్మన్ సింగినేని చినబాబుల ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 50 కుటుంబాల వారు పార్టీలో చేరేందుకు ముందుకు రాగా ఎమ్మెల్యే కన్నబాబు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీసీ, ఎస్సీ, ఓసీ సామాజిక వర్గాలకు చెందిన దెయ్యాల గోపి, కడియాల సూర్యనారాయణ, పంపన సత్తిబాబు, గంజా సూర్యనారాయణ, వాసంశెట్టి అప్పలరాజు, నక్కా బాబూరావు, గంజా పరమానందం, మేడపాటి సిద్ధు, పచ్చిమాల నాగేశ్వరరావు, మేడపాటి కార్తీక్, కొల్లాబత్తుల రవి, అవిరపు దుర్గాప్రసాద్, రేలంగి వెంకటరమణ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ అన్ని సామాజికవర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఏ పార్టీలో లేని విధంగా సీట్లు ఇచ్చి అందరికీ సమన్యాయం చేశారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామని, అదే చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏ మాత్రం అమలు చేశారో ప్రజలకు వివరించాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింతగా అభివృద్ధి సాధించాలన్నా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని, అందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించాలన్నారు. వచ్చే నెల రోజులు వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులందరూ కల్సికట్టుగా ప్రచారం చేస్తూ, పార్టీ విజయానికి కృషిచేయాలని కన్నబాబు కోరారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, కరప ఏఎంసీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో మత్స్యకారుల చేరిక

ఆహ్వానించిన ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కాకినాడ దుమ్ములపేటలో టీడీపీ-జనసేన పార్టీలకు చెందిన సుమారు 100 మంది మత్స్యకార యువకులు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వీరందరికీ ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మత్స్యకార గ్రామమైన దుమ్ములపేటను దత్తత తీసుకుని ఏనాడు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. తమ హయాంలో రూ.11 కోట్లు వెచ్చించి ఆ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ జనసేన కోసం ఎంతో అంకిత భావంతో పనిచేశామని, అయితే తమ కష్టాన్ని, శ్రమను వృథా చేస్తూ కూటమిలో చేరడం బాధ కలిగించిందన్నారు. అందువల్లే జనసేనను వీడి వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నేతృత్వంలో కాకినాడ అన్ని విధాలా అభివృద్ధి చేరగలదనే విశ్వాసం ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో మేరుగు పేతూరు, మేరుగు మోసే, మేరుగు పార్లియ్య, తిరిధి వీరబాబు, ఎరుపల్లి సతీష్, సూరాడ రూతమ్మ, కోమటి శ్యామల, మైలపల్లి శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఏ వ్యాధికైనా తీయని ఔషధం హోమియో

బాలాజీచెరువు: ఏ వ్యాధికైనా తియ్యని గుళికలతో నాలుకకు, మనసుకు ఇబ్బంది లేకుండా మందును అందించే ఏకైక వైద్య విధానం హోమియో వైద్యమని డాక్టర్ ఎంఎస్ఆర్ శాస్త్రి అన్నారు. బుధవారం కాకినాడ వెంకట్‌నగర్ గాయత్రి హోమియోపతి డాక్టర్స్ మీటింగ్ హాలులో ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ శామ్యూల్ హనీమన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడారు. హోమియో వైద్య విధానంలో మొండి రోగాలకు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆదరణ పెరుగుతోందన్నారు. రోగి కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణ ప్రాముఖ్యతను గుర్తించేందుకు ఇటువంటి సభలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ హోమియోపతి వైద్యులు జీబీ సాగర్, సుబ్బారావు, రాంబాబు, సలాది సూర్యకిరణ్ తదితరులు పాల్గొని హానిమన్ చిత్రపటానికి నివాళులర్పించారు.


డాక్టర్ హనిమన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పట్టణ హోమియో వైద్యులు

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: హోమియో పితామహుడు హనిమన్ జయంతిని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, డాక్టరు సలాది సూర్య కిరణ్, వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా, శ్రీనగేష్ తదితరులు ఆయనకు నివాళులర్పించారు. డాక్టర్ సూర్య కిరణ్ మాట్లాడుతూ 1755 ఏప్రిల్ పదిన జర్మనీలో హనిమన్ జన్మించారని, గాఢత తగ్గే కొద్దీ సామర్థ్యం పెరుగుతుందనే నూతన సిద్ధాంతంతో తక్కువ ఖర్చుతో సులభంగా అందుబాటులోకి వచ్చేలా మందులు తయారు చేశారన్నారు. వీటి వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. అనంతరం డాక్టరు సూర్యకిరణ్‌ను అడబాల రత్నప్రసాద్ సన్మానించారు.

ఐడీఏ ఆధ్వర్యంలో..

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో హనిమన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. హోమియో వైద్యుడు రామ్మోహన్‌రావును రాష్ట్ర ఐడీఏ సీడీహెచ్ కన్వీనర్ డాక్టరు అడ్డాల సత్యనారాయణ ఘనంగా సన్మానించారు.


కోడ్ అమలుకు సహకరించాలి

- వలంటీర్లను ఎన్నికలకు దూరంగా ఉంచాలి
- ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) అమలుకు రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది సహకరించాలని ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ఆయా రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు ఎన్నికల నియమావళిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రామారావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా ప్రక్రియలో వచ్చిన క్లెయిమ్‌ల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామని, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని రామారావు కోరారు. ఓటర్ల జాబితాలో వచ్చిన క్లెయిముల పరిష్కారంపై మరింత అవగాహన అవసరమన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఇప్పటికి ఫారం-6కు సంబంధించి 457, ఫారం-7కు సంబంధించి 52, ఫారం-8కు 98 దరఖాస్తులు అందాయన్నారు. ఆయా క్లెయిముల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆర్డీఓ అన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న ఈవీఎం ట్యాంపరింగ్ అనే అపోహలను ప్రజలు విడనాడి, ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలోకి గ్రామ వలంటీర్లను తీసుకువచ్చే ప్రసక్తే లేదని, రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద ప్రభుత్వ ఉద్యోగులు గాని, వలంటీర్లుగాని ఉంటే ఈసీ తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని ఆయన హెచ్చరించారు. అనంతరం ఓటర్ల జాబితా విధానం, ఎన్నికల ప్రక్రియ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో గోపు మురళి (వైఎస్సార్ సీపీ) కనపర్తి చీమదొర (వైఎస్సార్ సీపీ) రంధి సత్యనారాయణ (టీడీపీ) నీలపాల సూరిబాబు (సీపీఎం)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వసంత నవరాత్ర పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో బుధవారం రెండవ రోజు వసంత నవరాత్ర పూజలు కొనసాగించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, మహాన్యాసం, కుమారా రామభీమేశ్వర స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, బాలాత్రిపుర సుందరి దేవికి నవావరణార్చన, నీరాజన మంత్రపుష్పాలు, కుంకుమార్చన, దర్బారు సేవ, వేదస్వస్తి నిర్వహించారు.


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

టోఫెల్ ఏర్పాట్ల పరిశీలన

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలను సీఎంఓ చామంతి నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రైమరీ పాఠశాలల్లో టోఫెల్ పరీక్షను ఐఎఫ్‌బీ, స్మార్ట్ టీవీల ద్వారా ఏ విధంగా నిర్వహిస్తున్నారో పరిశీలించారు. అదే విధంగా ఎలిమెంటరీ పాఠశాలల వాతావరణాన్ని పరిశీలించారు. పాఠశాలలోని ఆర్ ప్లాంటులను, విద్యార్థుల వర్కు బుక్‌లను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. ప్రతి గంటకు ఒకసారి విద్యార్థులు తాగునీరు తాగాలని ఆయన సూచించారు. అదే విధంగా మండల పరిధిలోని అచ్చంపేట ఎలిమెంటరీ పాఠశాలను మండల విద్యాశాఖాధికారి-2 పి పుల్లయ్య పరిశీలించారు.